




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

20 YEARS ANNIVERSARY

https://www.satyamdaily.net/

శనివారం 14-6-2025

సంపుటి: 21 సంచిక: 70

పేజీలు: 8 వెల: రూ.1



25 YEARS. HOSPITALS. | REAL WEALTH IS GOOD HEALTH.

KIMS HOSPITALS™ | SRIKAKULAM



GRAND OPENING

తేది: 2025 జూన్ 15న (ఆదివారం)

సమయం: ఉదయం 10.30 గం॥లకు

అధునాతన వైద్యపరికరాలు.. నైపుణ్యం కలిగిన వైద్యులు.. అన్ని వర్గాలకు ఒకేచోట వైద్య సదుపాయం కలిగిన అత్యాధునిక కిమ్స్ హాస్పిటల్స్‌కు ప్రారంభోత్సవ శుభాకాంక్షలు



శ్రీ సత్యకుమార్ యాదవ్ గారు
హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ & మెడికల్ ఎడ్యుకేషన్ మినిస్టర్

శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు గారు
కేంద్ర పౌర విమానయాన శాఖామాత్యులు

శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు గారు
రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, మత్స్యశాఖ మంత్రివర్యులు

శ్రీ గొండు శంకర్ గారు
శాసనసభ్యులు, శ్రీకాకుళం

## కిమ్స్ హాస్పిటల్స్ (శ్రీకాకుళం)

## దత్త గుడి దగ్గర, పి.ఎన్. కాలనీ జంక్షన్



SMS SUSHANT MANPOWER SERVICES

కాంట్రాక్టర్

HOSPITALS and HOMES SERVICE

• ఎడిటోరియల్

# ఏపీ, కర్ణాటక మధ్య మామిడి చిచ్చు!

దేశాల మధ్య సరిహద్దు వివాదాలు చెలరేగడం.. అవి యుద్ధాలకు దారితీయడం సహజం. ఒకే దేశంలోని రాష్ట్రాల మధ్య కూడా సరిహద్దులతో పాటు జలవివాదాలు రేగుతుంటాయి. అయితే ఇవి కాస్త ఉద్రిక్తతలకు కారణమవుతాయే తప్ప పెద్ద ప్రమాదం ఉండదు. కారణం.. జలవివాదాలు, సరిహద్దు వివాదాల పరిష్కారానికి ప్రత్యేక ట్రిబ్యునళ్లు ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు కృష్ణానదీ జలాల విషయంలో కర్ణాటకతో, ఇప్పుడు తెలంగాణతో.. అలాగే గోదావరి జలాల విషయంలో మహారాష్ట్రతో సుదీర్ఘ కాలంగా నలుగుతున్న జలవివాదాలలు, అలాగే ఒడిశాతో సరిహద్దు వివాదాల గురించి తెలిసిందే. కానీ ఇవేవీ కాకుండా అందరూ ఇష్టంగా తినే మామిడి పళ్లు రెండు రాష్ట్రాల మధ్య చిచ్చు రేపడం నిజంగా విడ్డూరమే. అవునండీ.. ఇది నిజమే! ఇరుగుపొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల మధ్య మామిడి పళ్ల వివాదం రాజుకుంది. చిత్తూరు జిల్లా కలెక్టర్ జూన్ ఏడో తేదీన జారీ చేసిన ఆదేశాలు ఈ వివాదానికి అంకురార్పణ చేశాయి. ఇది అటు తిరిగి.. ఇటు తిరిగి.. ముఖ్యమంత్రి స్థాయిలో లేఖాస్త్రం సంధించేలా చేసింది. ఇతర రాష్ట్రాల నుంచి చిత్తూరు జిల్లాలోకి తోతాపురి రకం మామిడి పళ్ల ప్రవేశాన్ని నిషేధించామన్నది చిత్తూరు కలెక్టర్ ఆదేశాల సారాంశం. ఇదే రాష్ట్రాల మధ్య మ్యాంగో వార్‌కు దారి తీసింది. ఏపీ విధించిన నిషేధంపై కర్ణాటక ముఖ్యమంత్రితో పాటు ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బంగినపల్లి, సువర్ణరేఖ, చెరుకు రసాలు వంటి వాటితోపాటు తోతాపురి అనేది మామిడి పళ్లలో ఒక రకం. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో తోతాపురి మామిడిని విస్తృతంగా సాగు చేస్తుంటారు. ఈ పళ్లను బెంగుళూరు లేదా శాండర్ష అని కూడా పిలుస్తుంటారు. పొడవుగా ఉండి చివరన కొనదేలి చిలుక ముక్కును పోలి ఉండటం ఈ పళ్ల ప్రత్యేకత. తోతాపురి మామిడిని ఎక్కువగా జ్యూస్ పల్ప్, ఇతర మామిడి పానీయాల తయారీకి ఉపయోగిస్తుంటారు. తోతాపురి విస్తారంగా లభిస్తున్నందునే మన రాష్ట్రంలో చిత్తూరు జిల్లాలో చాలా మామిడి ప్రాసెసింగ్, పల్ప్ తయారీ కంపెనీలు ఉన్నాయి, మూడు రాష్ట్రాల సరిహద్దు మార్కెట్ల నుంచి తోతాపురి మామిడి పళ్లు సేకరిస్తుంటాయి. ఈ ఏడాది 5.5 లక్షల టన్నుల మామిడి పళ్ల సేకరణను ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది, అంతా బాగానే ఉంది.. మరి కర్ణాటక నుంచి వచ్చే ఆ పళ్లపై నిషేధం ఎందుకు విధించారన్న ప్రశ్న తలెత్తవచ్చు. దానికి కారణం.. ధరల్లో వ్యత్యాసం. కర్ణాటకలో పండే తోతాపురి పళ్ల ధర మన రాష్ట్రంలో కంటే తక్కువగా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే ప్రతి ఏటా మామిడి సీజనులో తోతాపురం మామిడి పళ్ల కొనుగోలు ధరను ఏపీ ప్రభుత్వం ప్రకటిస్తుంటుంది. అదే రీతిలో ప్రస్తుత సీజనులో కిలో మామిడికి రూ.8 ధర ప్రకటించింది. అలాగే తోతాపురి పళ్ల లభ్యత అధికంగా ఉండటాన్ని దృష్టిలో ఉంచుకుని కిలోకు అదనంగా మరో రూ.4 ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించింది. కానీ కర్ణాటకలో కిలో ధర కేవలం రూ.5 నుంచి రూ.6 మాత్రమే ఉంది. ఈ పరిస్థితుల్లో కర్ణాటక మామిడి పళ్లను ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి అనుమతిస్తే ప్రాసెసింగ్, పల్ప్ తయారీ పరిశ్రమలవారు మన రాష్ట్ర మామిడి పళ్లను కాకుండా తక్కువ ధర ఉన్న కర్ణాటక మామిడి కొనుగోలుకే మొగ్గు చూపుతారు. ఇది ఆంధ్ర రైతులను కష్టాల్లోకి నెడుతుందన్నది ఏపీ ప్రభుత్వ వర్గాల ఆందోళన. అందుకే కర్ణాటక నుంచి దిగుమతులను నిషేధించింది. ఈ నిషేధం వల్ల సుస్థిర సరఫరా గొలుసుకట్టు వ్యవస్థను దెబ్బతీసిందని, అలాగే వేలాది రైతుల జీవనోపాధిని నేరుగా ప్రభావితం చేస్తూ పంట నష్టాలను తీవ్రతరం చేస్తుందని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఆ మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలినీ రజనీష్ కూడా ఏపీ సీఎం, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు ఈ అంశంపై లేఖ రాశారు. ఈ నిషేధాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు కోరారు. ఈ నిర్ణయం కర్ణాటకలోని మామిడి రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుందని పేర్కొన్నారు. ఈ రైతులంతా తమ పంట ఉత్పత్తులను విక్రయించడానికి చిత్తూరులోని ప్రాసెసింగ్ యూనిట్లపైనే ఆధారపడుతున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ నిషేధాన్ని ఎత్తివేయకపోతే కర్ణాటక రైతులు కూడా ప్రతీకార చర్యలకు దిగవచ్చని, ఏపీ నుంచి కర్ణాటకకు వచ్చే కూరగాయలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను అడ్డుకోవచ్చని హెచ్చరించారు. జాతీయస్థాయిలో ప్రత్యర్థులుగా ఉన్న ఎన్డీయే కూటమి ఆంధ్రలో, కాంగ్రెస్ కర్ణాటకలో అధికారంలో ఉన్నందున ఈ వివాదం రాజకీయంగానూ రచ్చగా మారే అవకాశం ఉంది.

## గ్రాడ్యూటీ వెంటనే చెల్లించాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏపీఎస్ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు లీవ్ ఎంక్యాష్మెంట్, గ్రాడ్యూటీ వెంటనే చెల్లించాలని ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈమేరకు శనివారం అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఆర్.ప్రసాదరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముందుగా అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు సంతాపంగా మౌనం పాటించారు. అదే విధంగా రహదారి ప్రమాదంలో మృతి చెందిన అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి భాషా, కృష్ణా జిల్లా మాజీ ఉపాధ్యక్షులు, టైర్ మెకానిక్ కె.సింహాచలంలకు నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.ఎస్.ఆర్.శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.అప్పారావులు మాట్లాడుతూ ఏపీ పీటీడీ విశ్రాంత ఉద్యోగులకు తక్షణమే లీవ్ ఎన్‌క్యాష్మెంట్, గ్రాడ్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా వైద్యసదుపాయాలు కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం మినిమమ్ పెన్షన్‌పై తక్షణ చర్యలు చేపట్టి 75 లక్షలమందికి తగిన న్యాయం చేయాలన్నారు. హయ్యర్ పెన్షన్స్‌పై డిమాండ్ లెటస్ వాక్సిన్ డి.డి. లు కట్టి చాల కాలంగా హైద్రాబాద్‌లో ఉండిన కేసులు తక్షణం విశాఖపట్నం రీజనల్ ఆఫీస్‌కు పంపి వారికీ హయ్యర్ పెన్షన్ వచ్చేవిధంగా చేయాలనీ, రిజెక్ట్ అయిన కేసులలో ఢిల్లీ వారి ఆదేశాలు ప్రకారం తక్షణమే వారికీ డిమాండ్ లెటర్స్ వచ్చేటట్లు చేయాలన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్స్, కోశాధికారి ప్రసాద్, డిపో అధ్యక్ష/కార్యదర్శులు, మాట్లాడుతూ ఆర్గనైజేషన్ పెంపుకు, సి.సి.ఎస్. ఫారాలు అందరు 23 వ తేదీ లోగా పూర్తిచేసుకోవాలని, అలాగే సి.ఎల్. గ్రాడ్యూటీ రావాల్సిన వారికీ వచ్చేలా కృషి చేయిస్తామని తెలిపారు. తదుపరి మే నెలలో రిటైరయిన ఉద్యోగులకు చిరు సన్మానం చేశారు. సమావేశంలో సుమన్, పెంటయ్య, ప్రతాప్, భాస్కరరావు, శిమ్మయ్య ఆర్.వి.రావు, ప్రసాద్, రామారావు, భాగ్యలక్ష్మి, చిన్నరావు, సత్యం, దయాల్, ప్రసాద్, చిన్నబాబు, పి.ఎల్. రావు, ఉమా, నారాయణ, సత్తిరాజు, శ్రీను, సూర్యారావు, పాపారావు, గురువులు, సుబ్బారావు, అప్పారావు, రమణ, నాయుడు, మూర్తి, వెంకట్రావు, కృష్ణా, త్రినాథ్, సూర్యనారాయణ, దాస్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో 'యోగాంధ్ర'కు సన్నద్ధం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో ఈ నెల 21న జరగనున్న రాష్ట్ర స్థాయి 'యోగాంధ్ర' కార్యక్రమానికి శ్రీకాకుళం జిల్లా నుంచి పెద్దఎత్తున ప్రజలు, విద్యార్థులు, అధికారులు పాల్గొనాలన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని 80 అడుగుల రోడ్డులో మాక్ యోగా కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు సమిష్టిగా కృషి చేశారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన యోగా సదస్సులో కామన్ యోగా ప్రోటోకాల్‌కు అనుగుణంగా విన్యాసాలు నిర్వహించారు. అధికారులు తాగునీరు, ప్రథమ చికిత్స, టీ-షర్టులు, యోగా మ్యాట్స్, వేదిక ఏర్పాటు వంటి ఏర్పాట్లను సమర్థవంతంగా చేపట్టారు. అన్ని శాఖల అధికారులు, పాఠశాలలు, శిక్షణ నిపుణులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, యోగా ఇన్‌స్ట్రక్టర్లు బృందాలుగా భాగస్వామ్యమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ, నగరంలోని 80 అడుగుల రోడ్డును ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకూ యోగా, మెంటల్ ఫిట్‌నెస్, స్కేటింగ్ వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాలకు కేటాయించాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికీ యోగా ప్రారంభించని వారు యూట్యూబ్‌లో కామన్ యోగా ప్రోటోకాల్‌ను చూసి సాధన మొదలుపెట్టవచ్చునని సూచించారు. ప్రతి ఒక్కరూ యోగ సాధనలో భాగస్వాములై తమ ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవాలన్నారు. ఈ మాక్ యోగా కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్డీవో సాయి ప్రత్యూష, జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య, ఐసిడిఎస్ పీడీ బీ.శాంతిశ్రీ, టూరిజం అధికారి నారాయణరావు, డిఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు, డిపిఓ భారతీ సౌజన్య, శ్రీకాకుళం ఆర్డీఓ సాయి ప్రత్యూష ,ఐసిడిఎస్ పిడి శాంతిశ్రీ, డిఆర్డిఏ పిడి కిరణ్ కుమార్, జిల్లా అధికారి నారాయణరావు, శ్రీకాకుళం తహసిల్దార్ గణపతి రావు, డిఆర్‌డిఏ పిడి కిరణ్ కుమార్, డిఎస్డీవో శ్రీధర్, స్కిల్ డెవలప్మెంట్ అధికారి సాయికుమార్, ఆయుష్ అధికారి డా.పి.జగదీష్, డా.ఉత్తమ్ రాజ్ రాణా, జె.శేఖరరావు, యోగా గురువులు తంగి స్వాతి, కొంక్యాన మురళీ, మురళి, గాయత్రి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థకు చెందిన సుధా రాణి, కల్పన, పతంజలి ప్రతినిధి డి.చినబాబు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారు?

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రచారంలో భాగంగా రాష్ట్రంలో అనేక మంది నిరుద్యోగులు ఉన్నారని, ఆ నిరుద్యోగులకు ప్రతినెలా నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఇంతవరకు ఏ నిరుద్యోగికి కూడా నిరుద్యోగ భృతి ఇవ్వకపోవడం ఏమిటని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొజాడ యుగంధర్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఈరోజు స్థానిక క్రాంతి భవన్‌లో పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేల చొప్పున నిరుద్యోగ భృతి చెల్లిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మాట ఇచ్చి మాయ చేశాడరన్నారు. నిరుద్యోగ యువకుల ఓట్లతో అధికారం చేజిక్కించుకున్న కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల ఆశల మీద నీళ్లు చల్లారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నిరుద్యోగుల ఊసే ప్రభుత్వం ఎత్తని పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో 1.56కోట్ల మంది ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించి, నిరుద్యోగభృతిని ఇవ్వాలని, లేనిపక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళన చేస్తామని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్.అరవింద్, వై.వేణు, ఎ.రాము, ఎస్.రామోజీ తదితరులు పాల్గొన్నారు






ఆమదాలవలస కాలేజ్ ప్రాంగణంలో అంగన్వాడీలో పసిపిల్లలతో ఎమ్మెల్యే, పీయూసీ రాష్ట్ర చైర్మన్ కూన రవికుమార్ ఆప్యాయంగా ముచ్చటిస్తూ పిల్లలు బాగోగులు, పోషకాహార నాణ్యత, వసతి సదుపాయాలు కోసం కనుకొని ఇంకా మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలని అధికారులను కోరారు.

– సత్యంన్యూస్, ఆమదాలవలస

# బోల్డ్ తగ్గింది.. బోర్ పెరిగింది!

టాలీవుడ్లో మిడ్ రేంజ్ హీరోలు సైతం ఇంకా ఓటీటీల వైపు చూడని సమయంలో విక్టరీ వెంకటేష్ లాంటి అగ్ర కథనాయకుడు.. తన అన్న కొడుకు రానా దగ్గుబాటితో కలిసి డిజిటల్ ఎంట్రీ ఇచ్చిన సిరీస్.. రానా నాయుడు. రెండేళ్ల కిందట వచ్చిన తొలి సీజన్..వెంకీ అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేసింది. విషయం తక్కువ.. బూతులెక్కువ అంటూ తీవ్ర అసహనం చెందారు వెంకీ అభిమానులు. ఇప్పుడీ సిరీస్ రెండో సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి ఈసారైనా వెంకీ-రానా ఫ్యాన్స్ ఈ సిరీస్‌ను మెచ్చేలా ఉందా? చూద్దాం పదండి.

**నటీనటులు:** రానా దగ్గుబాటి- వెంకటేష్ దగ్గుబాటి- సుర్వీన్ చావ్లా-కృతి కర్బందా- అర్జున్ రాంపాల్- అభిషేక్ బెనర్జీ-సుశాంత్ సింగ్-డినో మోరియా- రజత్ కపూర్-ఆదిత్య మేనన్ తదితరులు
**సంగీతం:** సంగీత్-సిద్దార్థ్
**ఛాయాగ్రహణం:** జాన్ సచ్మిట్
**నిర్మాతలు:** సుందర్ ఆరోన్-సుమిత్ శుక్లా
**దర్శకత్వం:** సుపర్ణ్ వర్మ-కరణ్ అన్షుమన్
**విడుదల:** నెట్‌ఫ్లిక్స్

### కథనం-విశ్లేషణ:

రానా నాయుడు తొలి సీజన్ రిలీజైనపుడు అదెంత ఆసక్తికరంగా ఉందన్న దాని మీద కంటే.. అందులో హద్దులు దాటిన బూతులు.. భరించలేని వల్గర్ సీన్ల గురించే ఎక్కువ చర్చ జరిగింది. ముఖ్యంగా ఫ్యామిలీ హీరోగా ముద్ర పడ్డ వెంకీ నుంచి ఇలాంటి కంటెంట్ రావడాన్ని ఆయన అభిమానులు అస్సలు జీర్ణించుకోలేకపోయారు. రెండో సీజన్‌కు వచ్చేసరికి మేకర్స్ ఈ ఫీడ్ బ్యాక్ మీద గట్టిగానే పని చేసినట్లున్నారు. బూతుల డోస్ బాగా తగ్గిపోయింది. ఇక వల్గర్ సీన్లు కూడా అంతగా కనిపించవు. కొంచెం బోల్డ్ సీన్లయితే ఉన్నాయి కానీ.. తొలి సీజన్ తరహాలో వల్గారిటీ అయితే లేదు. ఐతే దీంతో పాటే కథాకథనాల మీద కూడా కొంచెం దృష్టిపెట్టి ఉంటే బాగుండేది. తొలి సీజన్లో అయినా కథలో కొన్ని ఆసక్తికర మలుపులు ఉన్నాయి.. అక్కడక్కడా కొన్ని ఎపిసోడ్లు ఆసక్తి రేకెత్తిస్తాయి కానీ.. రెండో సీజన్ అయితే పూర్తి తేలిపోయింది. కొత్త పాత్రలు.. కొత్త విలన్లు వచ్చారు తప్ప.. కథలో ఏమంత కొత్తదనం కనిపించదు. అసలు హీరో లక్ష్యమేంటో అర్థం కాదు. ఏ పాత్ర పరమార్థమేంటో బోధపడదు. కొత్తగా మొదలైన పాత్రలతో రవ్వంత కూడా ఎమోషనల్ కనెక్షన్ ఏర్పడదు. ఎనిమిది ఎపిసోడ్లతో దాదాపు ఆరు గంటల సుదీర్ఘ నిడివితో సాగే సిరీస్‌లో వారెవా అనిపించే ఒక్క ఎపిసోడ్ లేదంటే ఇది ఏమాత్రం ఎంగేజ్ చేస్తుందో అర్థం చేసుకోవచ్చు.

'రానా నాయుడు' తొలి సీజన్లో ఏ పాత్ర ఏంటో తెలుసుకోవడానికి.. కథేంటో అర్థం చేసుకోవడానికి.. కొంత సమయం పడుతుంది. అందుకోసమైనా ఆసక్తిగా సిరీస్ చూస్తాం. ఆ రకంగా అయినా ఆ సీజన్ ప్రేక్షకులను కొంత ఎంగేజ్ చేస్తుంది. కానీ కథేంటో తెలిసిపోయాక.. పాత్రలేంటో అర్థమైపోయాక.. రెండో సీజన్ ఆసక్తికరంగా సాగాలంటే కొత్తగా అనేక మలుపులు ఉండాలి. అవి తర్వాత ఏం జరుగుతుందనే ఉత్కంఠను రేకెత్తించాలి. కానీ 'రానా నాయుడు' ఏ దశలోనూ ప్రేక్షకుల్లో ఉత్సాహం.. ఉత్కంఠ కలిగించదు. అర్జున్ రాంపాల్ పోషించిన కొత్త విలన్ పాత్ర అయితే పూర్తిగా వ్యర్థంగా అనిపిస్తుంది. ట్రైలర్లో ఆ పాత్రకు ఇచ్చిన బిల్డప్ కు.. సిరీస్ లో దాన్ని నడిపించిన తీరుకు పొంతన లేదు. అసలు రానా నాయుడికి.. అతడికి శత్రుత్వాన్ని సరిగానే ఎస్టాబ్లిష్ చేయలేదు. ఆ క్యారెక్టర్ ఏంటన్నదే అసలు అంతుబట్టదు. దీంతో పోలిస్తే హీరోకు కొత్త యజమానిగా మారే విరాజ్ ఒబెరాయ్ పాత్ర.. దాని చుట్టూ నడిపిన స్టోరీ కొంచెం నయం. చివరి రెండు ఎపిసోడ్లలో ఈ పాత్రతో ముడిపడ్డ కథనం.. కొన్ని మలుపులు ఆసక్తి రేకెత్తిస్తాయి. కానీ మెయిన్ విలన్ ట్రాక్ మాత్రం పూర్తిగా తేలిపోయింది.

రానా నాయుడు కుటుంబం మీద చాలా సన్నివేశాలు నడిపించారు కానీ.. అందులో ఒక్కటీ ప్రేక్షకులను ఎంగేజ్ చేయదు. ముఖ్యంగా వెంకటేష్ పాత్ర అసలీ సిరీస్‌లో ఎందుకు ఉందో అర్థం కాదు. తొలి సీజన్లో అయినా.. ఆ పాత్ర తాలూకు బ్యాక్‌స్టోరీ కొంత ఎంగేజ్ చేస్తుంది కానీ.. ఈసారి మాత్రం ఆ పాత్రను పూర్తిగా తేల్చి పడేశారు. తండ్రీ కొడుకుల మధ్య బంధాన్ని కానీ.. వారి మధ్య విభేదాలను కూడా సరిగా చూపించలేదు. వెంకీది జస్ట్ ఒక సహాయ పాత్రలా అనిపిస్తుంది తప్ప.. కథలో దానికి తగిన ప్రాధాన్యమే లేకపోయింది. అతను ఎప్పుడు ఏం చేస్తాడో అర్థం కాదు. ఇక ఆయన కొడుకుల పాత్రల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. బలమైన కాన్ఫ్లిక్ట్ పాయింట్ లేకపోవడంతో 'రానా నాయుడు-2'లో అతి పెద్ద బలహీనత. ఒకదాని వెంట ఒకటి పరిణామాలు జరిగిపోతుంటాయి కానీ.. ఏదీ ప్రేక్షకుల అటెన్షన్ రాబట్టదు. మొత్తం సిరీస్ అయ్యాక ఆరు గంటలు వృథా అయిన భావనే కలుగుతుంది తప్ప.. చెప్పుకోవడానికి ఇందులో ఒక్క స్టాండౌట్ ఎపిసోడ్ కూడా కనిపించదు.

– తుపాకి.కామ్ సౌజన్యంతో…

### కథ:

ఎన్ని అడ్డదారులైనా తొక్కి సెలబ్రెటీలకు వచ్చే సమస్యలను పరిష్కరించే ఫిక్సర్‌గా పేరున్న రానా నాయుడు (రానా దగ్గుబాటి).. దీని ద్వారా ఎంత డబ్బు సంపాదించినా మనశ్శాంతి లేకుండా బతుకుతుంటాడు. దీంతో భార్య కోరిక మేరకు ఇకపై ఇవన్నీ వదిలేయాలని అనుకుంటాడు. తాను పని చేస్తున్న మంత్రి ఓబీ నుంచి విడిపోతాడు. కానీ అంతలో రానా కొడుకు అనీ కిడ్నాప్ అవుతాడు. దీంతో తిరిగి పాత శైలికి మారిపోతాడు రానా. ఈ క్రమంలో అతను ఒబెరాయ్ (రజత్ కపూర్) దగ్గర పనికి కుదురుతాడు. మరోవైపు రానాకు రవూఫ్ (అర్జున్ రాంపాల్)తో శత్రుత్వం పెరుగుతుంది. తన తండ్రి నాగనాయుడు (వెంకటేష్) నుంచి కూడా తలనొప్పులు తప్పవు. దీంతో రానా కుటుంబం మరింత ఇబ్బందుల్లో చిక్కుకుంటుంది. మరి ఈ సమస్యలన్నింటినీ రానా పరిష్కరించుకున్నాడా.. ఈ క్రమంలో ఏం కోల్పోయాడు.. రానా కుటుంబం ఒక్కటైందా లేదా అన్నది మిగతా కథ.

### నటీనటులు:

'రానా నాయుడు'కు చెప్పుకోదగ్గ ఆకర్షణ అంటే.. రానా నటనే. సిరీస్ మొత్తంలో పర్ఫెక్ట్ కాస్ట్ అనిపించేది అతనే. ఈ పాత్రను బాగా అవగాహన చేసుకుని అందులో ఒదిగిపోవడానికి రానా ప్రయత్నించాడు. తొలి సీజన్‌తో పోలిస్తే మరింత కాన్ఫిడెంట్ గా నటించాడు. తన స్క్రీన్ ప్రెజెన్స్ చాలా బాగుంది. రానా కోసం యునీక్ క్యారెక్టర్లు రాయడానికి ఈ పాత్ర స్ఫూర్తిగా నిలుస్తుంది. వెంకటేష్ మాత్రం మరోసారి నిరాశపరిచాడు. ఆయన చేయదగ్గ పాత్ర కాదిది. ఆయన క్యారెక్టర్ని వ్యర్థంగా మార్చేశారు రెండో సీజన్లో. సుర్వీన్ చావ్లా చూడ్డానికి బాగుంది. హాట్ హాట్ గా కనిపిస్తూ.. నటనలోనూ ఆకట్టుకుంది. బోల్డ్ సీన్లో ఆమె కుర్రాళ్లను బాగానే ఆకట్టుకుంటుంది. విలన్ పాత్రలో అర్జున్ రాంపాల్ ప్రత్యేకంగా చేసిందేమీ లేదు. రజత్ కపూర్.. కృతి కర్బందా కీలక పాత్రల్లో రాణించారు. సుశాంత్ సింగ్.. అభిషేక్ బెనర్జీ.. ఆదిత్య మేనన్.. వీళ్లంతా ఓకే.

### సాంకేతిక వర్గం:

టెక్నికల్‌గా 'రానా నాయుడు' ఓకే అనిపిస్తుంది. బ్యాగ్రౌండ్ స్కోర్.. సినిమాటోగ్రఫీ బాగున్నాయి. సిరీస్ లో మంచి క్వాలిటీ కనిపిస్తుంది. నిర్మాణ విలువల్లో ఏమీ రాజీ పడలేదు. కానీ అమెరికన్ టీవీ సిరీస్ 'రే డొనోవన్'ను మనకు తగ్గట్లుగా అడాప్ట్ చేయడంలో దర్శకులు సుపర్ణ్ వర్మ - కరణ్ అన్షుమన్ నైపుణ్యం చూపించలేకపోయారు. సామాన్య జనానికి కనెక్ట్ అయ్యే కథాంశం.. పాత్రలు మిస్ కావడం 'రానా నాయుడు'కు అతి పెద్ద మైనస్. ఈ కథంతా వేరే ప్రపంచంలో నడుస్తున్నట్లు అనిపిస్తుంది. కథతో.. పాత్రలతో ఎమోషనల్ కనెక్ట్ ఏర్పరచడంలో దర్శక ద్వయం పూర్తిగా విఫలమైంది.





- పూర్తిగా ఆచరణలోకి రాని సూపర్ సిక్స్
- పాత విధానాల మార్పు తోనే పుణ్యకాలం సరి
- ఏడాది ఆలస్యంగా టీచర్ల నియామక ప్రక్రియ
- కొత్తగా తెరపైకి పూర్ టు రిచ్ పథకం
- అందుబాటులోకి వచ్చిన ఉచిత ఇసుక, అన్న క్యాంటీన్లు

# కూటమి ఏడాది పాలన




(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

అధికారంలోకి రావడానికి రాజకీయ పార్టీలు ఎన్నో రకాలుగా ప్రయత్నిస్తుంటాయి. ఎన్నికల ముందు ఇచ్చే హామీలు వాటిలో కీలకం. అందులోనూ ఇటీవలి కాలంలో పార్టీలు పోటాపోటీగా ప్రజాకర్షక హామీలు గుప్పించి ఓట్లు దండుకోవడం.. తీరా అధికారంలోకి వచ్చాక ఏవో కారణాలతో హామీల్లో చాలావాటిని గాలికొదిలేయడం సాధారణంగా మారింది. మారిన ఈ పరిస్థితుల్లో ప్రజాప్రభుత్వ పని తీరును అంచనా వేయడానికి ఇతర పాలనాపరమైన అంశాల కంటే హామీలు, ప్రజాకర్షక పథకాల అమలు తీరే గీటురాయిగా మారిందన్నది వాస్తవం. అదే సమయంలో ఐదేళ్ల కాలానికి ఎన్నికైన ఒక ప్రభుత్వ పని తీరును అంచనా వేయడానికి ఏడాది కాలం కచ్చితంగా సరిపోతుంది. ప్రభుత్వ మనుగడలో 'తొలి అడుగు'గా భావించే ఈ కాలంలో రాష్ట్రంలోని ఎన్డీయే కూటమి సర్కారు ఎంత ఫలవంతం అయ్యిందన్నది విశ్లేషించే ప్రయత్నమే ఈ కథనం.

రాష్ట్రంలో గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు విప్లవాత్మక తీర్పునిచ్చారు. అప్పటివరకు అధికారంలో ఉన్న వైకాపా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసినప్పటికీ.. దాన్ని తిరస్కరించి తెలుగుదేశం నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి తిరుగులేని విధంగా ఏకపక్ష మెజారిటీతో పట్టం కట్టారు. ఈ ఎన్నికల్లో టీడీపీ. బీజేపీ, జనసేనలతో కూడిన ఎన్డీయే కూటమి ఏకంగా 164 సీట్ల మెజారిటీతో గత ఏడాది జూన్ 12న రాష్ట్ర అధికార పగ్గాలు చేపట్టింది. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టి రికార్డు సృష్టించగా, పోటీ చేసిన 21 స్థానాల్లోనూ విజయం సాధించిన జనసేన తొలిసారి ప్రభుత్వంలో భాగస్వామి అయ్యింది. ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. తద్వారా అటు కేంద్రంలోనూ ఇటు రాష్ట్రంలోనూ ఎన్డీయే ప్రభుత్వాలు కొలువుదీరాయి. డబుల్ ఇంజిన్ సర్కారు కారణంగా అభివృద్ధి పరుగులు తీస్తుందని ఎన్డీయే కూటమి నేతలు ప్రకటించారు. ప్రజలు కూడా అదే విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలుకు ప్రాధాన్యమిస్తామని అధికారంలోకి వచ్చినప్పుడే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సరిగ్గా ఏడాది పదవీకాలం పూర్తి చేసుకున్న చంద్రబాబు సర్కారు సూపర్ సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయలేక పోయింది. దీనికి నిధుల సమస్య ప్రధాన అడ్డంకిగా ఉందని సీఎం చంద్రబాబు పలు సందర్భాల్లో చెప్పారు. అయితే సూపర్ సిక్స్‌లో పేర్కొన్న పథకాలన్నింటినీ కచ్చితంగా అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కాగా తొలి ఏడాది పాలనలో ఎన్నికల సమయంలో ఇవ్వని కొన్ని పథకాలను కూడా ప్రభుత్వం చేపట్టడం విశేషం.

### సామాజిక పింఛన్ల పెంపు

అధికారంలోకి రాగానే వృద్ధులు, వితంతువులు, కళాకారుల సామాజిక పింఛన్లను 3 వేల నుంచి నుంచి 4 వేల రూపాయలకు పెంచుతామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి నేతలు అధికారంలో వచ్చిన వెంటనే దాన్ని నిలబెట్టుకున్నారు. వలంటీర్ వ్యవస్థను తప్పించేసి సచివాలయ ఉద్యోగులతోనే ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయమే పెన్షన్లను లబ్ధిదారులకు ఇళ్ల వద్ద అందజేస్తున్నారు. మృతి చెందిన పురుష లబ్ధిదారుల స్థానంలో వితంతువులుగా మారిన వారి భార్యలకు పింఛను ఇచ్చే కార్యక్రమాన్ని ఈ నెల నుంచే ప్రారంభించారు. వైకాపా హయాంలో రహదారుల దుస్థితిని అసలు పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తాయి. అయితే కూటమి అధికారంలోకి రాగానే రూ.3,800 కోట్లు విడుదల చేసి రోడ్ల మరమ్మతులు చేపట్టారు. అలాగే గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ రహదారులకు రూ.6వేల కోట్లతో మరమ్మతులు చేయిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.

### కొత్తగా పీ-4 కార్యక్రమం

ఎన్నికల హామీల్లో లేని, ప్రచారంలో ప్రస్తావించని కొత్త కార్యక్రమాన్ని చంద్రబాబు సర్కారు ప్రారంభించింది. అదే పూర్ టు రిచ్ కార్యక్రమం. పీ–14 అని వ్యవహరించే ఈ కార్యక్రమం ద్వారా పేదలను సంపన్నులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో జనాభాలో సంపన్నులైన 10 శాతం మంది.. అట్టడుగున ఉన్న 20 శాతం మందికి నేరుగా సాయం చేయడమే దీని లక్ష్యం. విరాళాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చే సంపన్న వ్యక్తులను దీనికి మార్గదర్శకులుగా నియమిస్తారు. నిరుపేద లబ్ధిదారులను బంగారు కుటుంబాలుగా గుర్తిస్తారు. వచ్చే ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలో 15 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా కార్యాచరణ అమలు చేస్తున్నారు.

### రాజధాని శంకుస్థాపనల జోరు

అత్యంత కీలకంగా భావించే పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణాల కూడా ఈ ఏడాది కాలంలో అడుగులు పడలేదు. కేవలం శంకుస్థాపనలు, ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. అమరావతినే రాజధానిగా ఖరారు చేసిన కూటమి సర్కారు ఆ ప్రాంతంలో ఐదేళ్లుగా పెరిగిపోయిన తుప్పలు, డొంకలను తొలగించేందుకు ప్రాధాన్యమిచ్చింది. గత నెలలో ప్రధాని మోదీతో మళ్లీ రాజధాని పనులకు శంకుస్థాపం చేయించారు. సుమారు రూ.60 వేల కోట్ల విలువైన పనులకు పునాది రాళ్లు వేశారు. వీటిలో మూడో వంతు పనులకే టెండర్లు ఖరారయ్యాయి. అయితే అంతర్జాతీయ విమానాశ్రయంతో సహా రాజధాని సమగ్ర నిర్మాణానికి మరో 40వేల ఎకరాలు అవసరమని ప్రభుత్వం ప్రతిపాదిస్తుండటం చర్చనీయాంశమైంది. కీలకమైన పోలవరం ప్రాజెక్టు పనులు పురోగతిలో ఉన్నాయి. ప్రస్తుతం డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 2027 జూన్ నాటికి ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## వైకాపా తప్పులను సరిదిద్దే చర్యలు

వైకాపా ఐదేళ్ల పాలనలో జరిగిన తప్పులను సరిదిద్దుతామని ఎన్నికల సమయంలో కూటమి హామీ ఇచ్చింది. ఆ మేరకు వరుసగా చర్యలు తీసుకుంటూ పోతోంది. వైకాపా హయాంలో ఒక్కసారి కూడా టీచర్ల నియామకాలు చేపట్టలేదు. దాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత చంద్రబాబు మెగా డీఎస్సీ నియామకాల ఫైలుపైనే తొలి సంతకం చేశారు. కానీ ఎస్సీ వర్గీ కరణ వంటి వివాదాల కారణంగా దాదాపు ఏడాది ఆలస్యంగా 16347 టీచర్ పోస్టుల భర్తీకి ఈ నెల ఆరో తేదీ నుంచి డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటి లింగ్ చట్టం వివాదాస్పదమై ఎన్నికల్లో ఎన్డీయే ప్రచారాస్త్రంగా మారింది. ఆ మేరకు అధికారం చేపట్టిన నెల రోజుల్లోనే ఆ చట్టాన్ని రద్దు చేశారు. గత ప్రభుత్వ ప్రయోగాలతో అభాసుపాలైన ఇసుక పాలసీని చంద్రబాబు సర్కారు సంస్కరించింది. మళ్లీ ఉచిత ఇసుక పాలసీని అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం వినియోగదారుల నుంచి స్థానిక సంస్థలు సీనరేజీ మాత్రమే వసూలు చేయాలని నిర్ణయిం చింది. గత టీడీపీ ప్రభుత్వ చివరి రోజుల్లో ప్రారంభించిన అన్న క్యాంటీన్లను వైకాపా ప్రభుత్వం మూసేసింది. ఐదు రూపాయలకే టిఫిన్, భోజనం అందించే ఈ క్యాంటీన్లను కూటమి అధికారం లోకి వచ్చిన వెంటనే మళ్లీ తెరిచారు.

## సూపర్ సిక్స్‌లో ఇప్పటికి రెండే

ఎన్నికల ప్రచారంలో ప్రజలను బాగా అకట్టుకున్న, కూటమి ఫోకస్ చేసిన హామీ సూపర్ సిక్స్. ఆరు గ్యారెంటీల పేరుతో కూటమి వ్యూహకర్తలు దీన్ని తీసుకొచ్చారు. కానీ ఈ ఏడాది కాలంలో వీటిలో రెండే పథకాలు అమల్లోకి వచ్చాయి. ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్న హామీని ప్రభుత్వం దీపం 2.0 కార్యక్రమం ద్వారా ఆచరణలోకి తెచ్చింది. అయితే గత ఏడాది ఒక సిలిండర్, ఈ ఏడాది ఇప్పటి వరకు ఒక సిలిండర్ మాత్రమే ఉచితంగా అందజేశారు. తల్లికి వందనం పథకం ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికీ(కుటుంబంలో ఒకరికి అన్న పరిమితి లేకుండా) ఏడాదికి రూ.15వేలు చొప్పున అందజేస్తామన్న హామీ ఏడాది ఆలస్యంగా అమల్లోకి వచ్చింది. గత విద్యా సంవత్సరంలో అందని ఈ పథకాన్ని ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయిన సందర్భంగా ఈ నెల 12న ఆచరణలో పెట్టారు. అయితే గత ప్రభుత్వం మాదిరిగా విద్యా వ్యవస్థ అభివృద్ధి కోసం రూ.2 వేలు మినహాయించి రూ.13వేలు చొప్పునే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ గత ఏడాది ఇవ్వలేదు. ఈ ఏడాది బడ్జెట్‌లో దీనికి రూ.6,300 కోట్లు కేటాయించినా ఇప్పటివరకూ పథకం అమలు కాలేదు. యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా నెలకు రూ. 3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీ ఇంకా అమలుకు నోచుకోలేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించే పథకానికి సంబంధించి కసరత్తు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నా ప్రభుత్వం ఇంకా అధికారికంగా స్పందించలేదు. 18 నుంచి 49 ఏళ్ల మధ్య వయస్సులైన మహిళలందరికీ నెలకు రూ.1500 ఇస్తామని సూపర్ సిక్స్‌లో ప్రకటించారు. కానీ ఇప్పటివరకు ప్రభుత్వ వర్గాలు దీని ఊసెత్తడంలేదు.

## వృద్ధురాలి మెడలోని గొలుసు చోరీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



వృద్ధురాలు మెడలో గొలుసు చోరీ చేసిన ఘటన శుక్రవారం రాత్రి పీఎన్ కాలనీలో కలకలం రేపింది. బాధిత మహిళ కళ్లేపల్లి ఈశ్వరమ్మ శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు శ్రీకాకుళం నగరం పీఎన్ కాలనీ మూడో లైనికి చెందిన ఈశ్వరమ్మ ఫ్రెండ్ కాలనీలో తన బంధువు మృతి చెందడంతో పరామర్శకు వెళ్లారు. తిరిగి శుక్రవారం రాత్రి 8 గంటలకు ఇంటికి వచ్చి తలుపులు తీస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి వెనుక నుంచి వచ్చి తనమెడలో ఉన్న మూడున్నర తులాల బంగారం పుస్తెల తాడు లాక్కుని వెళ్లిపా యాడు. బాధిత మహిళ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





మండలం చిన్నరావుపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ ఉపాధి హామీ కూలీలు యోగాంధ్ర-25 లో భాగంగా శనివారం యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేయర్ జగపతి మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజూ యోగాసనాలు వేయాలని సూచించారు. ఈనెల 21న యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కొత్త రమణ, మేట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, ఎచ్చెర్ల

# జిఎస్టీ వసూళ్లను పెంచండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


జిఎస్టీ వసూళ్ల పెంపుదలకు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఈమేరకు వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ శ్రీ బుడుమూరు నాగార్జున అధ్యక్షతన శనివారం జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని వ్యాపారసంస్థలు, కార్యకలాపాలు జిఎస్టీ చట్టం కింద నమోదు చేసుకోవలసి ఉన్నప్పటికీ నమోదు చేసుకోకుండా పన్నులు ఎగవేసేందుకు చూస్తున్నారన్నారు. అటువంటి వారిని పన్ను పరిధిలోకి తీసుకువచ్చే విధంగా చూడాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. అటువంటి వర్తకులు సమాచారాన్ని వాణిజ్య పన్నుల శాఖకు అందించాలన్నారు. పాత బకాయిల వసూళ్లకు సంబంధించి రెవెన్యూ విభాగం అధికారులు బకాయిదారుల ఆస్తులను గుర్తించడంలో జీఎస్టీ అధికారులకు పూర్తి సహాయ సహకారాలు ఉండేలా చూడాలన్నారు. లీడ్‌బ్యాంక్, ఇతరబ్యాంకు అధికారులకు ఆదేశాలను ఇస్తూ జిఎస్టీ అధికారుల నుండి నోటీసులో జారీ అయిన పన్ను బకాయిదారులకు సంబంధించిన ఖాతా వివరాలను అందించడం, వారి ఖాతాలను స్తంభింపజేయడం మొదలైన చర్యల ఆవశ్యకత గురించి తెలియజేశారు. ఈ విషయంగా స్టాంప్స్ & రిజిస్ట్రేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖల అధికారులకు ఆదేశాలను ఇస్తూ పన్ను బకాయిదారులకు సంబంధించిన ఆస్తుల వివరాలు, బిల్డర్లకి సంబంధించి, కొత్త రిజిస్ట్రేషన్ వివరాలను జిఎస్టీ అధికారులకు అందించాలన్నారు. అక్రమ రవాణా నిరోధించటానికి సంబంధించి మైనింగ్, రవాణా శాఖ అధికారులను వాణిజ్య పన్నుల శాఖతో సమన్వయం పనిచేయాలని ఆదేశించారు. స్థానిక వస్తు, సేవల వినియోగాన్ని ప్రోత్సహించడానికి ఇంజనీరింగ్ విభాగాలు కాంట్రాక్టర్లను స్థానికంగా లభించే డీజిల్, ఇతర నిర్మాణ సామగ్రి వాడకాన్ని ప్రోత్సహించాలని ఆదేశించారు. టీడీఎస్, టీసీఎస్‌లు జిఎస్టీ చట్ట పరిధిలోనికి వచ్చే కాంట్రాక్ట్ సేవలు, ఇతర పన్ను చెల్లించదగిన సేవలకు సంబంధించి మూలంలోనే పన్ను వసూలు చేసేందుకు చట్టప్రకారం చర్యలు తీసుకోవలసిందిగా డీడీఓలకు ఆదేశాలు జారీ చేయాలని పంచాయితీరాజ్, రూరల్ డెవలప్మెంట్, ఇంజనీరింగ్, ఇరిగేషన్, గృహ నిర్మాణ శాఖ మొదలైన డీడీఓలకు ఆదేశించారు. వృత్తి పన్ను వసూళ్లకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డు, టెక్నికల్ ఎడ్యుకేషన్, మున్సిపల్ అధికారులు మొదలగు శాఖల అధికారులను ఆదేశిస్తూ వాణిజ్య పన్నుల శాఖతో ఎప్పటికప్పుడు తగిన సమాచారాన్ని అందిస్తూ వృత్తిపన్ను వసూళ్ల పెంపుదలలో భాగస్వామ్యం కావలసినదిగా సూచించారు. సమావేశంలో శ్రీకాకుళం సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ గొలివి రాణిమోహన్, ఆమదాలవలస సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ చలుమూరు కొండమ్మ, డిప్యూటీ ఏసి బడియా కామరాజు తదితరులు పాల్గొన్నారు.




## అగ్నికుల క్షత్రియ సేవా సంఘ భవనం ప్రారంభం

(సత్యంన్యూస్, కవిటి)

మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన అగ్నికుల క్షత్రియ సేవ సంఘ భవనంను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ భవనానికి జడ్పీ నిధులు రూ.15 లక్షలు, ఎంపీపీ నిధులు సుమారు రూ.6లక్షలు మంజూరయ్యాయన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీలతోపాటు మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాల్, ఎంపీపీ కడియాల పద్మలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కవిటి మండల వైకాపా అధ్యక్షులు కడియాల ప్రకాష్, పిన్నింటి తిలక్, పులకల శ్రీరాములు, బర్ల నాగభూషణరావు, యలమంచి నీలయ్య, ఎన్.బాబూరావు, సర్పంచ్ పూడి అబ్బాయి, ఎంపీటీసీలు పూడి నీలాచలం, దుద్ది ధర్మారావు, మానక్ శంకర్, పొల్లాయి నీలాచలం, మొగలపురి కృష్ణారావు, మొగలపురి సీతారాం, పొల్లాయి ఉమాశంకర్, సంతు బెహరా, పిల్లి ప్రేమానందమ్, అగ్నికుల క్షత్రియ నాయకులు పొల్లాయి లక్ష్మణమూర్తి, పొల్లాయి సింహాచలం, పొల్లాయి దేవరాజు, పొల్లాయి కృష్ణ, పొల్లాయి ముకుందరావు, దున్న పురుషోత్తంలు పాల్గొన్నారు.




'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# సుఖీభవపై ఆచితూచి!

అన్నదాత సుఖీభవ



* ✶వ్యవసాయ శాఖ లాగిన్‌లో 2.88 లక్షల మంది రైతులు
* ✶తహసీల్దారు లాగిన్‌లో 77వేల ఖాతాల వివరాలు
* ✶రికార్డులు సక్రమంగా లేవంటూ 44వేల ఖాతాల తిరస్కరణ
* ✶పెండింగ్‌లో మరో 13వేల మంది రైతుల వివరాలు
* ✶ఉద్యోగులు, ప్రభుత్వ పెన్షనర్లు, ఐటీ చెల్లింపుదారులకు సుఖీభవ లేదు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మీరెవరైనా కానీయండి.. ఏ ఉద్యోగమైనా చేయండి భూమి ఉంటే చాలు.. రైతుగా గుర్తించి పెట్టుబడి సాయం అందిస్తాం.. అంటూ గతంలో ఉన్న ప్రభుత్వాలు రైతుల ఖాతాల్లో సొమ్ములు వేశాయి. సాధారణంగా ఉద్యోగులు, ఇన్‌కమ్ ట్యాక్స్ కట్టేవారు, ప్రభుత్వ పింఛనుదారులు తమ భూమిని కౌలుకు ఇచ్చి ప్రభుత్వం ఇచ్చిన పెట్టుబడి సాయాన్ని మాత్రం తమ జేబులో వేసుకునేవారు. ఈసారి కూటమి ప్రభుత్వం ఇటువంటి వారికి చెక్ పెట్టింది. సహజంగానే గతం కంటే ఎక్కువ పెట్టుబడి సాయాన్ని అందిస్తున్న ప్రభుత్వం లబ్ధిదారుల సంఖ్య తక్కువగా ఉండాలనే భావిస్తుంది. అందులో భాగంగానే అన్నదాత సుఖీభవ పేరిట రూ.20వేలు అందిస్తున్నవారి జాబితాను ఒకటికి పదిసార్లు వడపోత చేపడుతోంది.

### జోరుగా తీసివేతలు

అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల జాబితా తయారీ కసరత్తు పూర్తిచేసి రైతుసేవా కేంద్రాల నుంచి వ్యవసాయశాఖ కమిషనరేట్‌కు పంపించినట్టు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 5.87 లక్షలు రైతు ఖాతాలు ఉన్నాయి. వడపోతలు పూర్తిచేసిన తర్వాత 4.80 లక్షలు ఖాతాలు రికార్డులు పరిశీలించి 2.88 లక్షల మంది రైతుల వివరాలను వ్యవసాయ శాఖ లాగిన్‌లో ఉంచారని తెలిసింది. మిగతా 77వేల ఖాతాల వివరాలు తహసీల్దారు లాగిన్‌లో ఉన్నట్టు చెబుతున్నారు. వీరిలో 44 వేల మంది రైతుల ఖాతాల రికార్డులు సక్రమంగా లేకపోవడంతో తిరస్కరించారని తెలిసింది. మరో 13వేల మంది రైతుల వివరాలు పెండింగ్‌లో పెట్టినట్టు తెలిసింది. ఆర్‌టీజీఎస్ (రియల్ టైం గవర్నెన్స్ సిస్టమ్)లో వడపోత తర్వాత జిల్లాస్థాయిలో పరిశీలన పూర్తయిన వెబ్‌ల్యాండ్ వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. అన్నదాత సుఖీభవకు కొన్ని సాంకేతిక సమస్యలు, రెవెన్యూ చిక్కులు ఎదురవడంతో వేలాది మంది రైతుల వివరాలు పెండింగ్‌లో పెట్టారు. సమగ్ర సర్వే తర్వాత తలెత్తిన సమస్యలు ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉన్నాయి. దీంతో రైతులు అనర్హుల జాబితాలో పెండింగ్‌లో పెట్టారని తెలిసింది. ఈ నెల 20 నాటికి అన్నదాతకు సుఖీభవ కింద అందించనున్న సాయానికి సంబంధించి ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా అధికారులు కసరత్తు సాగిస్తున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆధార్ అనుసంధానంతో ఉన్న అనర్హులను గుర్తించి తుది జాబితాను మళ్లీ రైతుసేవా కేంద్రాలకు పంపించి, అందులోని లబ్ధిదారులందరితో తప్పనిసరిగా ఈకేవైసీ చేయించి ప్రక్రియ పూర్తి చేస్తారని అధికారులు చెబుతున్నారు.

### జిల్లాలో గతంలో 3.22 లక్షలకుపైనే

వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుంచి వచ్చిన వెబ్‌ల్యాండ్ డేటాను విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌తో పాటు మండల వ్యవసాయశాఖ అధికారుల లాగిన్‌లకు పంపించి వెబ్‌ల్యాండ్‌లో సర్వే నెంబర్లు, రైతు పేరు, విస్తీర్ణం కచ్చితంగా ఉన్నదీ లేనిదీ రైతు సేవా కేంద్రాల్లో పరిశీలించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి పరిశీలన పూర్తి చేసి అనర్హులను గుర్తించి జాబితా నుంచి తొలగించారని తెలిసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 658 రైతుసేవా కేంద్రాల్లో ప్రస్తుతం ఈ ప్రక్రియ పూర్తిచేసి ఈ నెల 12 నాటికి వ్యవసాయ కమిషనరేట్‌కు జాబితాలను పంపించేశారు. వైకాపా హయాంలో జిల్లావ్యాప్తంగా కౌలు రైతులతో కలిపి 3.22 లక్షల మందికి రైతుభరోసా జమ చేస్తూ వచ్చారు. ఆ సంఖ్య ఈ ఏడాది పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వైకాపా హయాంలో ఉద్యోగులు, వారి కుటుంబాలు, ప్రభుత్వ పింఛను పొందేవారు, ఆదాయపు పన్ను చెల్లించేవారంతా అర్హుల జాబితాలో చేర్చి రైతుభరోసా జమ చేశారు. ప్రస్తుతం వీరి వివరాలన్నీ వెబ్‌ల్యాండ్‌కు అనుసంధానం చేసి అర్హుల జాబితా నుంచి తొలగించాలని వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని అధికారులు చెబుతున్నారు.

### అమలుకు సన్నాహాలు

సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన 'అన్నదాత సుఖీభవ' రూ.20 వేలు ఆర్థిక సాయం ఈ నెల 20న మొదటి విడత రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్ర ప్రభుత్వంతో కలిపి రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్టు సీఎం చంద్రబాబు అధికారికంగా ప్రకటించారు. పెట్టుబడి సాయాన్ని ప్రధానమంత్రి కిసాన్ యోజన మాదిరిగానే కేంద్రం జమ చేస్తున్న రోజునే ఏడాదిలో మూడు విడతలుగా ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. పీఎం కిసాన్ యోజన ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.2వేలు చొప్పున మూడు విడతలుగా ఏడాదికి రూ.6వేలు సాయం అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.6వేలుకు మరో రూ.14వేలు కలిపి మొత్తం రూ.20 వేలు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. వైకాపా హయాంలో పీఎం కిసాన్ యోజనతో కలిపి మొత్తం రూ.13,500 జమచేశారు. వీటిలో కేంద్రం వాటా మూడు విడతల్లో రూ.6వేలు కాగా, రాష్ట్ర ప్రభుత్వం వాటా రెండు విడతల్లో రూ.7,500 రైతుల ఖాతాల్లో జమ చేసేవారు.

# సెల్ఫీవీడియో తీసుకొని ఆత్మహత్యాయత్నం

* ●పురుగుల మందు సేవించిన టీడీపీ కార్యకర్త కుటుంబం
* ●వారసత్వ భూమిని లేఅవుట్‌గా మార్చిన రెవెన్యూ యంత్రాంగం
* ●లోకేష్‌కు ఫిర్యాదు చేశారని నీలగిరితోట ధ్వంసం







(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా తెలుగు దేశం కార్యకర్త అయిన తన భూమికి రక్షణ లేకుండాపోయిందని, న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేకపోవడం వల్లే భార్యాభర్తలమిద్దరం ఆత్మహత్య చేసుకుంటున్నామని, తమ పిల్లలకైనా న్యాయం జరుగుతుందన్న నమ్మకంతో పురుగుల మందు తాగేస్తున్నామంటూ సెల్ఫీ వీడియో ఒకటి రికార్డు చేసి, ఆత్మహత్యకు ప్రయత్నించిన దంపతుల వీడియో ఇప్పుడు జిల్లాలో విపరీతంగా ట్రోలవుతోంది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ వీడియో వెనుక ఉన్న కథనం బాధితుల స్టేట్‌మెంట్ మేరకు ఇలా ఉంది.

శ్రీకాకుళం రూరల్ మండలం గూడెం గ్రామంలో నివసిస్తున్న శీర కోటేశ్వరరావుకు రాగోలు రెవెన్యూలో సర్వే నెం.179లో 1.90 ఎకరాలు, సర్వే నెం.180/1లో 1.50 ఎకరాలు మొత్తం 3.40 ఎకరాల వారసత్వంగా వచ్చిన భూమిని గత ప్రభుత్వం హయాంలో లే–అవుట్‌గా చూపించారు. సాగుహక్కు, అనుభవంలో వున్న సదరు భూమిని జగనన్న–భూరక్ష పథకంలో నిర్వహించిన రీ–సర్వేలో లే–అవుట్ కింద నమోదు చేశారు. సదరు భూమిని రీసర్వే చేసినప్పుడు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు లేఅవుట్‌గా మార్చేశారు. సదరు భూమి ఆన్‌లైన్‌లో శీర కోటేశ్వరరావు పేరుతో ఉన్నప్పటికీ పేరును తొలగించి లే–అవుట్ కింద నమోదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో అధికారులకు అర్జీలు సమర్పించినా న్యాయం జరగలేదు. దీంతో గ్రామంలోని కొందరు వైకాపా నాయకులు ఆ భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని బాధితుడు కోటేశ్వరరావు ఈ నెల 9న మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో రెవెన్యూ గ్రామ అధికారితో పాటు వైకాపాకు చెందిన నాయకులు, కార్యకర్తల పేర్లను ప్రస్తావించారు. గ్రామసభలు, గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా సమస్యకు పరిష్కారం చూపించడం లేదని ప్రజాదర్బార్‌లో విన్నవించారు. ప్రజాదర్బార్‌లో విన్నవించి తిరిగి గ్రామానికి చేరుకునే లోగా సదరు భూమిలో ఉన్న నీలగిరి మొక్కలను నరికేశారు. దీంతో మనస్తాపానికి గురైన శీర కోటేశ్వరరావు, భార్య అనసూయ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. పురుగులు మందు తాగడానికి ముందు సెల్ఫీ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీంతో స్థానికులు కొందరు అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇచ్చి వారిద్దరినీ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ అవుట్ పోస్టులో కేసు నమోదుచేసి రూరల్ పోలీసులకు అప్పగించి దర్యాప్తు చేస్తున్నారు. భార్యభర్తల పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది.

# పోలీసుల అదుపులో సైబర్ క్రైం నిందితులు

* ✶రూ.6 లక్షలు నగదు స్వాధీనం
* ✶వివరాలు వెల్లడించిన డీఎస్పీ వివేకానంద

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఆన్‌లైన్‌లో డాక్టర్లను, వ్యాపారస్తులను, స్థితిమంతులను టార్గెట్ చేసుకుని సైబర్ క్రైంకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నట్టు శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద తెలిపారు. ఈమేరకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితులను మీడియా ముందుకు తీసుకువచ్చి వివరాలను ఆయన వెల్లడించారు. నగరం పరిధిలో నమోదైన పలు సైబర్ క్రైం కేసుల్లో కర్ణాటకకు చెందిన రుమన్ షరీఫ్, కేరళకు చెందిన నౌఫాలా షరీన్, నాజుముద్దీన్ చాక్లతొప్పును విశాఖ రైల్వేస్టేషన్ వద్ద అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. వీరి నుంచి రూ.6 లక్షలు నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఆధార్‌తో అనుసంధానం చేసిన ఫోన్ నెంబర్‌లను సేకరించి సీబీఐ నుంచి ఫోన్ చేస్తున్నట్లుగా నమ్మించి డబ్బులు అకౌంట్‌లో జమ చేసుకోవడంలో ముగ్గురు అనేక నేరాలకు పాల్పడ్డారని తెలిపారు. అందులో భాగంగానే కిమ్స్ రోడ్డులో ఉన్న క్రాంతి ప్రైడ్ అపార్ట్‌మెంట్‌లో నివాసం డాక్టర్ పి.రేవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. ఆమె నుంచి రూ.13.50 లక్షలు డిపాజిట్ చేయించుకొని మోసానికి పాల్పడ్డారని తెలిపారు. మైసూర్, కోజికోడ్ ప్రాంతాలు తిరిగి ముద్దాయిలను అదుపులోకి తీసుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన అధికారులను అభినందించారు. సమావేశంలో సీఐలు పైడపునాయుడు, రాజేష్, ఎస్ఐ ఎం.హరికృష్ణ, సిబ్బంది ఈశ్వరరావు, రమణ, ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.



కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో సూపర్ సిక్స్‌లో భాగంగా తల్లికి వందనం హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చి చదువుకున్న అందరి పిల్లలకు ఈ పథకం అందించగలిగామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఏడురోడ్ల కూడలి వద్ద జరిపిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ నాయకుడు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో అమలు చేశారని అన్నారు. ఇది రాష్ట్ర చరిత్రలోనే ఓ గొప్ప విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు స్వాతిశంకర్, టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

# రక్తదాతలే నిజమైన హీరోలు

- జేసీఐ మెయిన్ అధ్యక్షులు కూన అనీల్ -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసేవారు అసలైన హీరోలని జెసీఐ మెయిన్ అధ్యక్షులు కూన అనీల్ పేర్కొన్నారు. శనివారం రక్తదాతల దినోత్సవం సందర్భంగా నగరంలోని న్యూబ్లడ్ బ్యాంకు శ్రీకాకుళంలో జెసీఐ వ్యవస్థాపక అధ్యక్షులు జామి భీమశంకర్ సూచనల మేరకు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అనీల్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. యువత రక్తదానంలో ముందుండాలని, రక్తదానం చేయడం వల్ల మరొకరికి జీవితాన్నిచ్చిన వారవుతారన్నారు. జిల్లాలో ఏటా తలసేమియా వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, డయాలసిస్ పేషెంట్లు రక్తం దొరకక మృత్యువాత పడుతున్నారని, వారిని ప్రాణాపాయం నుంచి రక్షించేందుకు బాధ్యతగా ప్రతీఒక్కరూ ఏడాదిలో రెండుసార్లు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ తమ్మినేని ఉషారాణి, పోషక్ కుమార్, అంధవరపు సంతోష్‌కుమార్, జేసీఐ శ్రీకాకుళం మెయిన్ మెంబర్స్, యువత పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్
# కౌన్సిల్ మెంబర్‌గా చాపర సుధాకర్

(సత్యంన్యూస్, ఆమదాలవలస)



ఆమదాలవలస పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు, టిడిపి సీనియర్ నాయకులు డాక్టర్ చాపర సుధాకర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులయ్యారు. విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి ప్రభుత్వం 8 మంది సభ్యులతో కూడిన కొత్త ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నియామకానికి సీఎం చంద్రబాబునాయుడు ఆమోదించారు. రాష్ట్రస్థాయిలో హెల్త్ యూనివర్సిటీకి జిల్లాకు చెందిన సుధాకర్‌ను ఎంపిక చేసి జిల్లాకు మొదటసారిగా ఈ అవకాశం కల్పించారు. తన నియామకం పట్ల సీఎం చంద్రబాబు నాయుడుకు, మంత్రి లోకేష్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్‌కు, డాక్టర్ సుధాకర్ ధన్యవాదాలు తెలిపారు.

## స్కూల్‌కు పంచాయతీ కార్యాలయం

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ఎమ్మెల్యే ఎన్ఈఆర్ కృషి ఫలితంగా తోటపాలెం ప్రాథమికోన్నత పాఠశాల జిల్లాపరిషత్ హైస్కూలుగా మారింది. అయితే 1 నుంచి 9 తరగతుల విద్యార్థులకు రూములు సరిపడక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని విద్యాకమిటీ చైర్మన్ పుట్ట ఈశ్వరరావు, అతని మిత్రులు కళ్లేపల్లి నాగరాజు కలిసి పాత పంచాయతీ ఆఫీస్ కార్యాలయాన్ని శనివారం శుభ్రం చేశారు. విద్యార్థులకు కావాల్సిన విధంగా పెయింటింగ్స్ వేయించి స్కూల్‌కి వాడుకోవడానికి వీలుగా ఏర్పాటుచేసి ఇచ్చారు. ఇది కదా నేటి తరం యువత చేయాల్సింది.



# ట్రెజరీ ఉద్యోగుల రక్తదానం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం ట్రెజరీ ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రెజరీ ఉద్యోగులు డేవిడ్ మాదారపు, బి.ప్రదీప్ కుమార్, బి.గాంధీ, కే.వరప్రసాద్, ఎస్.సూర్యచంద్ర, కే.సతీష్ చంద్ర, టీ.అనిల్, సీహెచ్.సంతోష్, ఎన్.ఈశ్వరరావు, బి.సాయికృష్ణ రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరీ ఉద్యోగులు డి.శ్రీరామ్‌కుమార్, బి.శ్రీనివాసరావు, పి.చంద్రశేఖర్, సీహెచ్.చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు. రెడ్‌క్రాస్ సెక్రటరీ బలివాడ మల్లేశ్వరరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పెంకి చైతన్యకుమార్, పి.శ్రీకాంత్, గుణాకర్, నర్సింగరావు పాల్గొన్నారు.

# ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత మనందరిదీ

☆లయన్ పొన్నాడ రవికుమార్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత మందరిదని, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్ అన్నారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా స్థానిక లయన్స్ రక్తనిధి కేంద్రంలో బ్లడ్ బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న లయన్ పొన్నాడ రవికుమార్ మాట్లాడుతూ ప్రతీ ఒక్క పౌరుడూ మానవతా దృక్పథంతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పది మంది ప్రాణాలు కాపాడటంలో భాగమవ్వాలని, రక్తదానంతో, ప్రాణదాతలుగా మారి వారి ప్రాణాలను కాపాడాలన్నారు. అనంతరం బ్లడ్‌బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్ మాట్లాడుతూ ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదానం చేసిన సిహెచ్ అరుణ్ కుమార్, ఎస్.శివ, ఎం.శరత్‌చంద్ర తదితరులకు ధన్యవాదాలు తెలిపి జ్ఞాపికను, ప్రశంసా పత్రాలను అందించి దుశ్శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సేవకులు మదర్స్ లవ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సుప్రజ రౌత్, సభ్యులు అల్లాడ నవీన్, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతన ఉపాధ్యక్షులు ఉర్లం శివతేజ, బాలు, బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ వందన, లక్ష్మి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.